సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన లక్ష్మణ్‌కు రూ.85,500లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నేతలు భాస్కర్‌యాదవ్, రవికుమార్, ఈశ్వరయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, అద్రాస్‌పల్లికి చెందిన లక్ష్మీకి చికిత్స నిమిత్తం సీఎంరిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 55,500 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

తైబజార్ వేలం రూ.25 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్ వీరారెడ్డి

పోచారం: పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేలం పాటలో అత్యధికంగా రూ. 24.77 లక్షలకు కక్కెర్ల శ్రీనివాస్ పాడుకొని తైబజార్ (అంగడి వ్యాపారం)ను దక్కించుకున్నారు. పాత మున్సిపాలిటీ పరిధిని రూ.16.77 లక్షలు, విలీన గ్రామాల పరిధిని రూ. 8 లక్షలకు పాడుకున్నారు. వేలంపాటలో మొత్తం 9 మంది పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు మేనేజర్లు నిర్మల, అశోక్, ఆర్ఓ కిరణ్‌కుమార్, ఆర్ఐ సాయిరాజ్, పోటీదారుల సమక్షంలో వేలంపాట కొనసాగింది.

తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి బెల్లి లలిత

జవహర్‌నగర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి బెల్లి లలితాయాదవ్ అని జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ అన్నారు. భువనగిరిలోని అమరవీరుల స్థూపం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెల్లి లలితయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొనపూరి కవిత, రాజారాంయాదవ్, సురేష్‌యాదవ్, వెన్నెల, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



రైతులతో మాట్లాడుతున్న డీఎం సుగుణబాయి

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాశాఖ డీఎం సగుణబాయి సందర్శించారు. ఈ సందర్భంగా సోమవారం ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్నదాతలకు సూచించారు. ధాన్యంలో తేమ, తాలు, దుమ్ము, మట్టిపెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.23 లక్షల నష్టం



ఘట్‌కేసర్: చందుపట్లగూడ వద్ద ఉన్న ఓ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్లగూడలోని గ్రీన్ లైఫ్ ఎంటర్‌ప్రైజెస్ కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంటలు అంటుకున్నాయనే సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఈ ఘటనలో కొయిర్ ఎక్స్‌ట్రాక్షన్ యంత్రం, కన్వర్, స్క్రీనర్, 40 హెచ్‌పీ మోటార్, 5 హెచ్‌పీ మోటార్ దగ్ధమైపోయాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ. 23 లక్షల నష్టం వాటిల్లిందని కంపెనీ నిర్వాహకుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలకు మోక్షమెప్పుడో !

- బోర్డులకే పరిమితమవుతున్న ఆటస్థలాలు
- లక్షలు వెచ్చించినా నిరుపయోగంగానే..

గ్రామీణ యువతకు ఆటలపై మక్కువ పెంచాలని, వారిని క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి గత ప్రభుత్వం గ్రామాలు, మున్సిపాలిటీల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. మైదానాల ఏర్పాటుకు స్థలాలు దొరకకపోవడంతో పలు గ్రామాల్లో గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయగా.. మరికొన్నింటినీ మున్సిపాలిటీల్లో చిన్నపాటి ఖాళీ స్థలాలకు క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేశారు. తదానంతరం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో బోర్డులకే పరిమితమయ్యాయి.

– మేడ్చల్‌రూరల్



ప్రైవేటు వెంచర్‌లో క్రికెట్ ఆడుతున్న యువత



గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ప్రైవేటు స్థలాలే దిక్కు..

గత ప్రభుత్వం గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కొన్నిచోట్ల ఊరికి దూరంగా, మరికొన్నిచోట్ల ఆటలకు అనువుగా లేని స్థలాలను ఎంపికచేసి, వాటి ఏర్పాటుకు రూ. 50 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చు చేసింది. గత ప్రభుత్వ సంకల్పం మంచిదే అయినా, ఆచరణ లేకపోవడం, క్రీడాకారులు ఆటలు ఆడేందుకు సరైన వసతులను కల్పించకపోవడంతో ప్రస్తుతం అవి బోర్డులకే పరిమితమయ్యాయి. వసతుల లేమి కారణంగా క్రీడాకారులు వాటిలో ఆడేందుకు ఆసక్తి చూపడం లేదు. చాలా గ్రామాలు, మున్సిపాలిటీల్లో యువకులు ప్రైవేటు స్థలాలు, వెంచర్లలోనే క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకుని వాటిలో ఆడుకుంటున్నారు.

కలగానే మినీ స్టేడియం...

మేడ్చల్ పట్టణ, సమీప ప్రాంతం యువత కోసం మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద పారిశ్రామికవాడలో చేపట్టిన మినీ స్టేడియం ఏళ్లు గడుస్తున్నా.. క్రీడాకారులకు కలగానే మిగిలిపోతుంది. 25 ఏళ్ల క్రితం నాటి ఎమ్మెల్యే దేవేందర్‌గౌడ్ శంకుస్థాపన చేయగా.. ఎన్నో అవంతరాల అనంతరం 2022లో పనులు ప్రారంభమైనప్పటికీ కొద్దిరోజులకే నిలిచిపోయాయి.

పేరుమార్చి ప్రారంభం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ క్రీడా ప్రాంగణంగా పేరును మార్చి, నాటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మరోసారి పనులు ప్రారంభించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక తమ కల నెరవేరినట్లే అని క్రీడాకారులు భావించగా.. సరైన వసతులు కల్పించకపోవడం, స్టేడియం పనులు పూర్తిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది.

మూలన పడిన ఆట వస్తువులు..

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపాలిటీలతో పాటు గ్రామపంచాయతీలకు క్రీడా సామగ్రి పంపిణీ చేసినప్పటికీ వాటిని బయటకు తీసి ఆడిన దాఖలాలు లేవు. కొన్ని గ్రామాల్లో క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ మెటీరియల్ క్రీడాకారులకు పంపిణీ చేయగా.. ప్రస్తుతం కనబడకుండా పోయాయి.

ప్రభుత్వం దృష్టి సారించేనా..

గ్రామీణ క్రీడాకారులు సైతం క్రీడల్లో రాణించాలని, వారిని క్రీడాకారులుగా మార్చాలనే సంకల్పంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం మంచిదే అయినా.. అధికారులు వాటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, క్రీడాకారులకు శాపంగా మారిందని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



మేడ్చల్ చెక్‌పోస్ట్‌లో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని ప్రస్తుత ప్రభుత్వమైనా అందుబాటులోకి తీసుకురావాలి. మున్సిపాలిటీలో క్రీడాకారులకు సరైన మైదానాలు లేకపోవడంతో డబ్బులు వెచ్చించి, ప్రైవేటు మైదానాల్లో ఆడుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తే మేడ్చల్ వాసులు మంచి క్రీడాకారులుగా రాణించగలుగుతారు.

– జుబేర్, క్రికెటర్

సరైన వసతులు కల్పించాలి



ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం, ఆడుకునేందుకు అనువుగా లేకపోవడంతో ఆటలు ఆడలేకపోతున్నాం. క్రీడాకారులమంతా కలిసి మైదానాన్ని చదును చేసుకుని, ఆడుకోవాలని భావించినా.. ఊరికి దూరంగా ఉండటంతో రాత్రుళ్లు భారీ వాహనాలు మైదానంలోకి రావడంతో ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి సరైన వసతులు కల్పించి ఆడుకునేందుకు అందుబాటులోకి తీసుకురావాలి.

– సాయి, క్రీడాకారుడు

అందుబాటులోకి తీసుకొస్తాం..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తీసుకొస్తాం. క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని గ్రామ అధికారులను ఆదేశిస్తాం. క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించి, యువత క్రీడలు ఆడుకునేందుకు కృషి చేస్తాం.

– వసంతలక్ష్మి, ఎంపీడీఓ, మేడ్చల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్ఎస్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కండ్లకోయ గ్రామం, రైల్వే ట్రాక్ రోడ్డు, సుతారిగూడ, సాయిగీతా ఆశ్రమం, పీటీసీ, మై ప్లేస్ అపార్ట్‌మెంట్, జయదర్శిని ఎన్‌క్లేవ్, ప్రెస్టీజ్ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

ఘట్‌కేసర్: పట్టణంలోని ఐబీఎం కళాశాలలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పద్మారెడ్డి ప్రకటించారు. జాబ్‌మేళాలో 5కు పైగా ప్రముఖ ఫార్మా, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఇతర పరిశ్రమల కంపెనీలు పాల్గొంటాయని, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–28 ఏళ్లున్న యువతి, యువకులు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరుకానున్న నిరుద్యోగులు దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



జవహర్‌నగర్‌లో నిరసన చేస్తున్న ప్రజా సంఘాలు

జవహర్‌నగర్: మానవీయత పాటించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించకపోవడాన్ని నిరసిస్తూ.. పీవోడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల సమక్షంలో సోమవారం జవహర్‌నగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాల సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. వెంటనే వారి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలన్నారు. ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్‌షావలి, ఎస్‌కె.మీరా, యాదగిరి, శివనారాయణ, యాకస్వామి, సావిత్రి, పాషామియా, సింగరయ్యగౌడ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 76 ఫిర్యాదులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పల్లె, బస్తీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రతివారం ప్రజావాణిలో తమ సమస్యలను అధికారులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్ చుట్టూ.. ప్రదక్షిణలు చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలో 15 మండలాలు, 13 పురపాలక సంఘాలు , 34 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపల్ సర్కిళ్లు (జీహెచ్ఎంసీ పరిధిలోని) ఉన్నాయి. ఇందులో నివాసం ఉండే బస్తీ, పల్లెవాసులు ,వలస ప్రజలు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసురావడానికి నగర శివారులోని తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కలెక్టరేట్‌కు తరలివస్తుంటారు. ప్రధానంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు కలెక్టరేట్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 76 ఫిర్యాదులు అందాయి. పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళఅంతస్తుల కట్టడాలపై అత్యధికంగా 22 ఫిర్యాదులు రాగా.. ఇవన్నీ పోచారం , నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, కొంపెల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు



ఉప్పల్, కాప్రా, కూకట్‌పల్లి, మల్కాజిగిరి మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి. ప్రజావాణిలో పెద్ద ఎత్తున 54కు పైగా ఫిర్యాదులు అధికారులకు అందజేశారు. డీఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, కలెక్టరేట్ విభాగం రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ.. ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి తీరాలి. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరయ్యే జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేయాలి.

– జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు



జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ

మల్కాజిగిరి: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం డిమాండ్ చేసింది. మల్కాజిగిరిలో జీహెచ్ఎంసీ వద్ద సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని, ప్రతిఏటా ఫీజులు పెంచుకుంటూ పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈసారి నుంచైనా ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, తల్లుల సంఘం మండల కన్వీనర్ రాధ, లావణ్య, రమాదేవి, చంద్రశేఖర్, కరణం గోపి తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు

శామీర్‌పేట్: పంటల మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధా, లక్ష్మీప్రసన్నలు తెలిపారు. సోమవారం మూడుచింతలపల్లి మండలం, కేశ్వాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలో మెలకువలపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి యూరియా వాడకూడదని, సాగుఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే రసాయనాలను వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. విత్తన రశీదులు భద్రపరుచుకోవాలని, కష్టకాలంలో పంట నష్టపరిహారాన్ని పొందాలన్నారు. ఏఈఓ లక్ష్మణ్‌గౌడ్, విద్యార్థులు రోహిత, శీరిష, రైతు సమితి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వీఓఏ మాధవీలత, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

కీసర: కీసర మండల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వద్ద 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యవసాయశాఖ అధికారిణి మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జనుము 40 కిలోల బస్తాకు రూ.2510, జీలుగ 30 కిలోల బస్తాకు రూ.2137లకు అందుబాటులో ఉన్నాయని, ఈ విత్తనాలు పొందడానికి తమ పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్లతో రావాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సర్వేయర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్‌జిల్లా, శామీర్‌పేటలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న కొత్తగా నియమితులైన 146 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, శిక్షణ కార్యక్రమానికి సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్లు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకుని, నేటి నుంచి ప్రారంభంకాకున్న శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. శిక్షణా కార్యక్రమం 52 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పొందిన తర్వాత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. శామీర్‌పేట్ మండలం తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, పలువురు సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాల తరలింపు కేంద్రం పనులు నిలిపేయాలి

అల్వాల్: చెత్త తరలింపు కేంద్రం నిర్మాణ పనులను నిలిపేయాలని మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని సాయిరెడ్డికాలనీలో హిందూ శ్మశానవాటిక స్థలంలో జీహెచ్ఎంసీ చెత్త తరలింపు కేంద్రం నిర్మాణ పనులు చేపట్టడంపై నిరసన వ్యక్తం చేస్తూ.. స్థానిక కాలనీవాసులు జేఏసీగా ఏర్పడి నిరసన తెలుపుతున్నారు. వీరికి మద్దతుగా సోమవారం కార్పొరేటర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు నిర్మాణ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. చెత్త తరలింపు కేంద్రం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, అధికారులు దీనిపై పునరాలోచించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి త్వరలో ఈ ప్రాంతాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడతారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు. డీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాయిరెడ్డి కాలనీ అధ్యక్షుడు దిలీప్, లక్ష్మీఎన్‌క్లేవ్‌కాలనీ అధ్యక్షుడు రాజేష్, పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లికార్జున్, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో మార్పు!

- నగదు లావాదేవీల్లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు
- 29 పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు



సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్ల విధానంలో ప్రభుత్వం మార్పులు చేసింది. నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తప్పించి, వార్డు ఆఫీసర్లకు అప్పగించారు. సరిపడాలేని పురపాలికల్లో సీనియర్, లేదా జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పజెప్పారు. ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలు అమలు చేయటంతో నగదు లావాదేవీల్లో అవకతవకలను పూర్తిగా నియంత్రించవచ్చని, పుర యంత్రాంగం భావిస్తోంది. రాష్ట్రంలోని పలు పురపాలిక(పట్టణాలు)ల్లో ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. దీన్ని అరికట్టేందుకు తాజాగా ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలను రూపొందించి అన్ని పురపాలికల్లో అమలుచేస్తోంది.

జమ చేయడం లేదని..

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని పలు పురపాలికల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆస్తిపన్నులు వసూలు చేస్తున్నారు. పురపాలక సంఘం కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో ఆస్తి పన్ను చెల్లించిన వారికి కంప్యూటరైజ్డ్ రశీదు అందజేస్తున్నారు. అయితే.. పలు పురపాలికల్లో ఆస్తిపన్నుల లావాదేవీల విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వసూలైన ఆస్తిపన్ను డబ్బులను సకాలంలో క్యాష్‌కౌంటర్‌లో జమచేయడం లేదన్న ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలను జారీ చేసింది.

రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు

పురపాలికల్లో ఏటా ఆస్తిపన్ను వసూళ్లను సిబ్బంది చేతి యంత్రాల్లో (హ్యాండ్ హెల్త్ మెషిన్) పీటీఐఎన్ (ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్) నమోదు చేసి ఎంతమేర పన్ను ఉందో చెప్పి, డబ్బులు వసూలు చేసి రశీదును అందజేస్తారు. సేకరించిన డబ్బులను పురపాలికల్లోని క్యాష్ కౌంటర్‌లో జమచేస్తారు. పన్నువసూళ్లకు చాలాచోట్ల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఉద్యోగుల పేరిటే యంత్రాలు

వాస్తవానికి చేతి యంత్రాలు (మిషన్లు) రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే ఉన్నా.. ఉద్యోగుల కొరత కారణంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిన విధులు చేపడుతున్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. దీంతో వారిని పన్ను వసూళ్ల నుంచి తప్పించి రెగ్యులర్ ఉద్యోగులనే నగదు లావాదేవీలు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాలని పురపాలకశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగుల కొరత ఉన్న చోట.. సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.

పకడ్బందీగా అమలు...

పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్ర మున్సిపల్ శాఖ సూచించిన నిబంధనలను ఆయా పురపాలక సంఘాల కమిషనర్లు అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలు జరిగిన కారణంగా పురపాలకశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే పురపాలక అధికార యంత్రాంగం అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో నగదు లావాదేవీల నిర్వహణ విధులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది.